సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం ׀ 2 ׀ జూన్ ׀ 2024



ఘనంగా తులసీదళార్చన

విశాఖ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తుల సీదళార్చన నిర్వహించారు.

8లో



కంబాలకొండలో ఫిర్యాదుల పెట్టెలు 8లో

కంబాల కొండ పార్కులో ఫిర్యాదులు, వినతుల స్వీకరణకు పెట్టెలు ఏర్పాటుచేశారు.



కమనీయం.. కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి శనివారం ఆర్జిత సేవల్లో భాగంగా కల్యాణం నిర్వహించారు.

8లో

న్యూస్‌రీల్

ముంచంగిపుట్టులో భారీ వర్షం



ముంచంగిపుట్టులో కురుస్తున్న వర్షం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై వరదనీరు భారీగా ప్రవహించింది. సంతబయలులో వరదనీరు నిలిచిపోయి బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.గాలులకు పలు పంచాయతీలలో మామిడి, జీడి నేల పాలయింది. పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షం తీరని నష్టం మిగిల్చిందని రైతులు వాపోయారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు



గంజాయితో పట్టుబడిన నిందితులు

వై.రామవరం: గంజాయితో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు మండలంలోని కొమరవరం రోడ్ జంక్షన్‌లో శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. కృష్ణా జిల్లాకు చెందిన కుంభా సాయి ప్రసాద్(29), ఆయాజిత్తుల కుల దీప శ్రీనివాస మృత్యుంజయ (19), ఒడిశాకు చెందిన కారా కృష్ణ(49) బైక్‌పై సుమారు రూ.30 విలువైన 6 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారని ఎస్‌ఐ తెలిపారు. ఎంఆర్వో కె.తాతబ్బాయిదొర, వీఆర్వో ధనలక్ష్మి సమక్షంలో పంచనామా నిర్వహించి, మోటారు బైక్, గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులు ముగ్గురిని ఆరెస్టు చేసినట్టు ఆయన తెలిపారు. శనివారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అడ్డతీగల సీఐ రవికుమార్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

వ్యవసాయ డిప్లొమా కోర్సుకు నోటిఫికేషన్ విడుదల



ప్రిన్సిపాల్ సుధాకర్

రంపచోడవరం: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే వ్యవసాయ డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు రంపచోడవరం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.సుధాకర్ తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు పదో తరగతి విద్యార్హత అని తెలిపారు. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2023 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంగ్లీషు చదివిన వారికి, మున్సిపాలిటీ పరిధిలో చదివిన వారికి 75:25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. జూన్ ఒకటి నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోచ్చన్నారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ డబ్లూడబ్ల్యూడబ్ల్యూ. ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ సందర్శించాలని ఆయన సూచించారు. జిల్లాలో రంపచోడవరంలో మాత్రమే ఏకైక వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల మాత్రమే ఉందన్నారు. 2013 ఈ కళాశాలల్లో రెండేళ్ల వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సు అందుబాటులో ఉందన్నారు. ఈ కళాశాలలో చదివిన నలుగురు విద్యార్థులు 2023లో అగ్రిసెట్‌లో ర్యాంక్‌లు సాధించారని తెలిపారు. అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయని తెలిపారు. అందులో రెండో సంవత్సరంలో మొదటి సెమిస్టర్‌తో పీఏఎంపీ ద్వారా విద్యార్థులు నేరుగా వ్యవసాయ విధానాలు, వ్యవసాయ వ్యాపారాలు ఇతర నైపుణ్యాలు అభ్యసిస్తారని తెలిపారు. సందేహాలు ఉంటే కళాశాలకు వచ్చి నివృత్తి చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 8247848525 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీ శారదాపీఠంలో ఘనంగా హనుమత్ జయంతి

పెందుర్తి: విశాఖ శ్రీశారదాపీఠంలో హనుమత్ జయంతి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా పీఠంలోని 16 అడుగుల దాసాంజనేయస్వామికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- కేంద్రాల వద్ద పటిష్ట భద్రత
- 144 సెక్షన్ అమలు
- మరో రెండు రోజుల్లో తేలనున్న అభ్యర్థుల భవితవ్యం



పాడేరు డిగ్రీ కళాశాల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు ఆర్వో భావన వశిష్ట

సాక్షి పాడేరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు గడువు దగ్గరపడింది. మరో రెండు రోజుల్లో రాజకీయ పార్టీల అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా కేంద్రాల్లో ఐరన్ గ్రిల్స్, విద్యుత్ దీపాలు, బారికేడ్లు ఏర్పాటుచేస్తున్నారు. లోపలకు పంపేందుకు అధికారులు, సిబ్బంది, ఏజెంట్లకు వేర్వేరు మార్గాలు ఏర్పాటుచేశారు. ఫలితాలు ప్రకటించేందుకు మీడియా సెంటర్‌ను సిద్ధం చేశారు. డిగ్రీ కళాశాల మార్గంలో భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. 144 సెక్షన్ అమల్లో ఉంది.

- స్థానిక డిగ్రీ కళాశాలలో అరకు వ్యాలీ, పాడేరు అసెంబ్లీ సెగ్మెంట్లకు వేర్వేరుగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. అరకు పార్లమెంట్‌కు సంబంధించి అరకు, పాడేరు నియోజకవర్గంలో పోలైన ఓట్ల లెక్కింపునకు కూడా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేశారు. రంపచోడవరం అసెంబ్లీ సెగ్మెంట్‌కు అక్కడి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే లెక్కింపు ప్రక్రియకు సంబంధించి నఉదయం ఐదు గంటలకు కౌటింగ్ సిబ్బంది నిర్దేశించిన టేబుళ్లకు చేరుకోవాలి.

పూర్తిస్థాయిలో అవగాహన..

- కౌంటింగ్ విధులకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు సహాయ రిటర్నింగ్ అధికారులతో పలు ధపాలు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు.
- కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎస్పీ తుహిన్ సిన్హా తగిన భద్రతా చర్యలు చేపట్టారు కౌంటింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఆదేశాల జారీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి కౌంటింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు.
- అరకు అసెంబ్లీ నియోజకవర్గం, పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయ జంక్షన్ నుంచి వచ్చే మార్గంలో డిగ్రీ కళాశాలకు ప్రవేశం కల్పిస్తున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.పాడేరు అసెంబ్లీ, అరకు పార్లమెంటు అభ్యర్థులు, కౌంటింగ్ సిబ్బందిని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి అనుమతిస్తామని పేర్కొన్నాయి.
- గత ఎన్నికల్లో విశాఖపట్నం స్వర్ణ భారతి స్టేడియంలో కౌంటింగ్ నిర్వహించారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటైన తరువాత తొలిసారిగా ఓట్ల లెక్కింపు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు సహకరించాలి

జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత

పాడేరు: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతవరణంలో సజావుగా జరిగేలా రిటర్నింగ్ అధికారులు అత్యంత జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. విజయసునీత తెలిపారు, శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా నియోజకవర్గాలకు కౌంటింగ్ ఏజెంట్ల నియామకం వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి గుర్తింపు కార్డులను జారీ చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదన్నారు. అరకు అసెంబ్లీకి 14, పాడేరు అసెంబ్లీకి 14, రంపచోడవరం అసెంబ్లీకి 20 టేబుళ్లను లెక్కింపు నిమిత్తం ఏర్పాటుచేశామన్నారు. ఆయా స్థానాలకు సంబంధించి ముందుగా పోస్టల్ బ్యాలెట్‌తో పాటు అప్పటి వరకు అందిన సర్వీస్ ఓట్లను లెక్కిస్తామని చెప్పారు.ఇప్పటి వరకు 113 సర్వీస్ ఓట్లు అందాయన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా ఎంపికైన కౌంటింగ్ సిబ్బందిని తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేస్తారన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని కోరారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది, ఏజెంట్లు కలుసుకునే అవకాశం లేదన్నారు. ఎవరికి కేటాయించిన మార్గాల్లో వారు మాత్రమే వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రత పరంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని మూడెంచల భద్రతా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పాడేరు, అరకు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు భావన వశిష్ట, అభిషేక్, డీఆర్వో పద్మావతి, ఏఎస్పీ ధీరజ్, వర్చువల్ విధానంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు విధులు



మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అన్ని మండలాలకు సంబంధించిన రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో కౌంటింగ్ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు వేర్వేరుగా టేబుళ్ల ఏర్పాటు జరుగుతుందన్నారు. ఒకొక్క టేబల్‌కు నలుగురు సభ్యులు ఉంటారని ఆయన తెలిపారు. అధికారులు, సిబ్బంది కౌంటింగ్ విధులు చాలా జాగ్రత్తగా నిర్వహించాలని పీవో సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ విధి విధానాలపై పూర్తి అవగాహనతో ఉండాలని సూచించారు.కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించిన హెల్ప్ డస్క్ విధులు కూడా చాలా జాగ్రత్తగా నిర్వహించాలని ఆయన సూచించారు. కౌంటింగ్‌కు సంబంధించి సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



హాజరైన అధికారులు

అల ‘జడి వాన’

- మెరుపులు, పిడుగులు, ఈదురుగాలులు
- పలుచోట్ల నేల కూలిన చెట్లు
- గాజువాకలో 6 సెం.మీల వర్షపాతం నమోదు



వుడా పార్క్‌లో ఈదురు గాలులకు కూలిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వేకువజాము వరకు కురిసిన వాన అలజడి రేపింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వాటికి పిడుగులు, ఈదురుగాలులు కూడా తోడయ్యాయి. ఫెళఫెళమంటూ శబ్దాలు చేస్తూ పిడుగులు ఒకపక్క, కుండపోత వర్షం మరోపక్క వెరసి ఉమ్మడి విశాఖ జిల్లాను తడిసి ముద్ద చేశాయి. పిడుగుల శబ్దాలకు నిద్రలో ఉన్న వారు ఉలికిపాటుకు గురయ్యారు. మరోవైపు ఈదురుగాలుల ధాటికి పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. కొన్నిచోట్ల రోడ్లపై చెట్లు కూలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెనువెంటనే వీటిని తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూశారు. తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు వర్షం కొనసాగింది. ఉదయం తర్వాత విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోనూ వాన అక్కడక్కడ కురిసింది. ఇలా శనివారం ఉదయం 8.30 గంటల వరకు అనకాపల్లి జిల్లా కె.కోటపాడులో 7.5 సెం.మీల భారీ వర్షపాతం నమోదైంది. ఇంకా గాజువాకలో 6 సెం.మీలు, కాపులుప్పాడలో 5.8, పరవాడలో 5.4, ఎస్.రాయవరంలో 5.2, గోపాలపట్నంలో 5, సింహాచలంలో 4.3, పెందుర్తిలో 4.2, నర్సీపట్నంలో 3.3 సెం.మీల చొప్పున వర్షం కురిసింది. కాగా రానున్న మూడు రోజులు విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, గంటకు 30–40 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అదే సమయంలో గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పడతాయని పేర్కొంది.

70.47 శాతం మేర పింఛన్ల పంపిణీ

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: ఏజెన్సీ ఏడు మండలాల్లో సామాజిక పింఛన్లు ఇంటింటికి వెళ్లి అందజేసినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. శనివారం ఆయన ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం మండలంలో 929 పింఛన్లకు గాను 750 మందికి, రాజవొమ్మంగి మండలంలో 1309 పింఛన్లుగాను 950 మందికి, అడ్డతీగల మండలంలో 1059 పింఛన్లకు గాను 757 మందికి, దేవీపట్నం మండలంలోని 968 పింఛన్లకు 669 మందికి, గంగవరం మండలంలోని 857 పింఛన్లకు 578 మందికి, వై. రామవరం మండలంలోని 641 పింఛన్లకు 410 మందికి, మారేడుమిల్లి మండలంలోని 459 పింఛన్లకు 271 మందికి అందజేసినట్టు చెప్పారు. ఏజెన్సీ ఏడు మండలాల్లో 6222 మంది పింఛనుదారులుండగా 4385 మందికి పింఛన్లు అందజేయడం జరిగిందన్నారు. తొలిరోజు శనివారం సాయంత్రం వరకు 70.47 శాతం మేర పింఛన్లు పంపిణీ జరిగిందన్నారు. మిలిగిన పింఛన్లు సంబంధిత లబ్ధిదారులకు సత్వరం అందేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు.

340 మంది ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



రాజవొమ్మంగిలో సర్వే చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: బడిబయట ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారికి మెరుగైన వైద్యం, విద్య అందించేందుకు జిల్లా అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా 18 సంవత్సరాల వయసులోపు పిల్లలను గుర్తిస్తున్నారు. ఈ విధంగా జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 340 మందిని గుర్తించినట్లు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ భాస్కర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట గుర్తించిన ప్రత్యేక అవసరాల పిల్లలను జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లోని 22 భవిత కేంద్రాల్లో చేర్పిస్తున్నామన్నారు. ఈ కేంద్రాల్లో ఇప్పటికే 1, 700 మంది చదువుకుంటున్నారన్నారు. వీరిని అన్ని సదుపాయాలతో సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్ది, విద్యావంతులను చేయడమే లక్ష్యమన్నారు. అంగవైకల్యం నుంచి విముక్తి కోసం ప్రతి వారం వీరికి ప్రత్యేక వైద్య నిపుణులు ఫిజియోథెరపి చేస్తారని, వారి ఆరోగ్యం, మానసిక స్థితి మెరుగుపడటానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. సర్వేలో రిసోర్స్ పర్సన్స్ హరిత తదితరులు పాల్గొన్నారు. ఇలావుండగా జిల్లా వ్యాప్తంగా గల ప్రత్యేక అవసరాల గల పిల్లలకు అవసరమైన హియరింగ్ ఎయిడ్స్, వీల్ చైర్స్, ఎంఆర్ కిట్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని భాస్కర్ తెలిపారు.

కళాశాల.. కళకళ

- తెరుచుకున్న జూనియర్ కాలేజీలు
- ప్రారంభమైన ఇంటర్ తరగతులు
- టెన్త్‌లో మెరుగైన ఉత్తీర్ణతతో కోర్సులకు డిమాండ్
- ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల జోరు
- తొలి రోజు విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశాలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 366 జూనియర్ కాలేజీలు
- గతేడాది 58,944 మంది విద్యార్థులు చేరిక
- వార్షిక విద్యా క్యాలెండర్ ఖరారు



విశాఖలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజీలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ

విశాఖ విద్య: చదువుల కాలం మళ్లీ మొదలైంది. 2024–25 విద్యా సంవత్సరం వార్షిక క్యాలెండర్ మేరకు ఉమ్మడి విశాఖ జిల్లాలో జూనియర్ కాలేజీలు శనివారం తెరుచుకున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు కాలేజీల బాట పట్టారు. తొలిరోజు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల, తల్లిదండ్రులతో సమావేశాలను నిర్వహించారు. ఏడాది చదువులు సవ్యంగా సాగేలా విద్యార్థులతో పాటు, తల్లిదండ్రుల పాత్రను ఆయా కాలేజీల్లో ప్రిన్సిపాల్స్ వారికి వివరించారు. సప్లిమెంటరీ పరీక్షలు ముగియడంతో సోమవారం నుంచి అన్ని జూనియర్ కాలేజీల్లో పాఠ్యాంశాల బోధన సైతం ప్రారంభించేందుకు కాలేజీల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటర్మీడియెట్ చదువుల ప్రాధాన్యత దృష్ట్యా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ప్రభుత్వం ఈసారి ముందుగానే ప్రకటించింది. జూనియర్ కాలేజీల్లో చదువులు సవ్యంగా సాగేలా ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 39 ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ –11, ట్రైబర్ వెల్ఫేర్ –10, కేజీబీవీ –34, బీసీ వెల్ఫేర్ –2 మోడల్ జూనియర్ కాలేజీలు –5, హైస్కూల్ ప్లస్ –16 , ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 246 కాలేజీలు ఉన్నాయి. ఎయిడెడ్, ఇన్సింటిష్, కార్పోరేట్ యాజమాన్యాల పరిధిలో ఒక్కో కాలేజీ ఉన్నాయి. వీటి పరిధిలో 2023–24 విద్యా సంవత్సరంలో ఫస్టియర్‌లో మూడు జిల్లాల్లో 58,944 మంది ఇంటర్మీడియెట్ కోర్సుల్లో చేరారు. టెన్త్‌లో మెరుగైన ఉత్తీర్ణత రావడంతో ఈ ఏడాది అడ్మిషన్లు 60 వేలకు పైగానే ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

పక్కాగా విద్యా క్యాలెండర్

2024–25 విద్యా సంవత్సరంలో 222 రోజులు కాలేజీలు పనిచేసేలా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు శనివారం నుంచి జూనియర్ కాలేజీల్లో పాఠ్యాంశాల బోధన మొదలుపెట్టారు. జులై 29 నుంచి 31 వరకు ఫస్ట్ యూనిట్, ఆగస్టు 29 నుంచి 31 వరకు సెకెండ్ యూనిట్ పరీక్షలు నిర్వహించనున్నారు. క్వార్టర్లీ సెప్టెంబర్ 23 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. దసరా సెలవులు అక్టోబర్ 3 నుంచి 11 వరకు ఉంటాయి.మూడో యూనిట్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 23 వరకు జరుగనున్నాయి. నాల్గో యూనిట్ పరీక్షలు నవంబర్ 21 నుంచి 23 వరకు, హాఫ్ ఇయర్లీ పరీక్షలు డిసెంబర్ 16 నుంచి 231వరకు ఉంటాయి. సంక్రాంతి సెలవులు 2025 జనవరి 13 నుంచి 18 వరకు ఇస్తారు. ప్రీ ఫైనల్ ఫిబ్రవరి 3 నుంచి 10 వరకు, వార్షిక పరీక్షలు మార్చి మొదటి వారంలో నిర్వహించేలా విద్యా క్యాలెండర్‌ను ప్రకటించారు.

అమ్మఒడితో ఉన్నత చదువులవైపు..

ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సైతం అమ్మఒడి పథకం కింద ఏడాదికి రూ. 15 వేలు అందుతుండటంతో పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువుల వైపు వస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నాడు–నేడు పథకం ద్వారా మౌలిక సౌకర్యాలు పెంపొందడంతో ఈ ఏడాది అడ్మిషన్లు పెరుగుతాయని కాలేజీల ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు. మరో పక్క ప్రతీ మండలంలో రెండు జూనియర్ కాలేజీలు అందుబాటులో ఉండేలా తగిన ఏర్పాట్లు చేశారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులు సైతం ఫలితాల తరువాత ఇంటర్మీడియెట్‌లో చేరనున్నారు. ఈ మొత్తం పరిణామాల్లో జూనియర్ కాలేజీలో విద్యార్థుల సందడి మొదలైంది.

అడ్మిషన్లు పెంపునకు ప్రత్యేక దృష్టి



2024–25 విద్యా క్యాలెండర్ ప్రకారం శనివారం నుంచి జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. స్పాట్ వ్యాల్యూషన్ కూడా సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం . భవిష్యత్ చదువులకు ఇంటర్మీడియెట్ తొలి మెట్టు అయినందున, నాణ్యమైన విద్య అందించేలా కాలేజీలపై పర్యవేక్షణ పెంచుతాం.

– మురళీధర్, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

ఏయూ ఈఈటీ సీట్లు కేటాయింపు పూర్తి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సెల్ఫ్‌సపోర్ట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు తొలి దశ కౌన్సెలింగ్ పూర్తిచేశారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసి, శనివారం సీట్లు కేటాయించారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోగా నిర్ణీత ఫీజును చెల్లించాలి. ఈ సంవత్సరం ప్రవేశాలకు భారీగా డిమాండ్ పెరిగింది. మెదటి వెయ్యి ర్యాంకులలోనే అధికశాతం మంది ప్రవేశాలకు దరఖాస్తు చేయడం , సీట్లు సాధించడం కనిపించింది.

పిడుగుపాటుకు ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- వాలీబాల్ మ్యాచ్ తిలకిస్తుండగా ఘటన



పిడుగుపడి మృతి చెందిన గెమ్మెలి రంగారావు

అరకులోయ టౌన్: మండలంలోని పద్మాపురం పంచాయతీ కేంద్రంలో శనివారం పిడుగుపాటుకు గురై ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలపాలయ్యాడు. హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ గూనగుమ్మి గ్రామానికి చెందిన గెమ్మెలి రంగారావు (35) పద్మాపురంలో వాలీబాల్ మ్యాచ్‌ను తిలకిస్తుండగా పిడుగుపడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గెమ్మెలి సాయి అరకు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు రంగారావుకు ఇద్దరు భార్యలు, ఐదురురు పిల్లలున్నారు. మృతదేహానికి ఆదివారంపోస్టుమార్టం నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం

హుకుంపేట: పిడుగుపాటు ప్రమాదంలో జీవాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని దుర్గం పంచాయతీ తోటకూరపాడులో శుక్రవారం పిడుగుపడి 20 మేకలు, నాలుగు పశువులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి చేరుకుని శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేవిధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాల స్వాధీనం



సాడీపేట వీధిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్సై అరుణ్‌కిరణ్

చింతపల్లి రూరల్: ఎన్నికల ఫలితాల వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై అరుణ్‌కిరణ్ తెలిపారు. శనివారం వంద మంది పోలీసులతో స్థానిక సాడీపేట వీధిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇక్కడ ప్రతి ఒక్కరి ఆధార్ కార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వారి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. వీధిలో వాహనాల రికార్డులు తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మామిడి పండ్ల సంతకు స్పందన

ఎంవీపీకాలనీ: సహజ సిద్ధంగా పండించిన మామిడి పండ్లను విక్రయించేందుకు ఎంవీపీ కాలనీలో ప్రత్యేక సంతను ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయదారుల సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం గిరిజన భవన్ వేదికగా ఈ సంత జరిగింది. ఈ సందర్భంగా కాలనీ వాసులు సంతకు తరలివచ్చి మామిడి పండ్లను కొనుగోలు చేశారు. విశాఖ గ్రామీణ ప్రాంతాలతోపాటు పలు చోట్ల ప్రకృతి వ్యవసాయం ద్వారా మామిడి పండ్లను పండించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రతినిధి పీఎల్ఎన్ రాజు తెలిపారు.

మళ్లీ 'టోల్' బాదుడు

- ప్రస్తుత చార్జీలపై 5 శాతం పెంపుదల
- నేటి అర్ధరాత్రి నుంచి అమలులోకి
- ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ నుంచి నిలిచిన చార్జీల పెంపు
- తుది దశ పోలింగ్ ముగియడంతో వడ్డనకు శ్రీకారం



అగనంపూడి టోల్ ప్లాజా

సాక్షి, విశాఖపట్నం : ఇప్పటికే వాహన యజమానులకు భారంగా మారిన టోల్‌గేట్ చార్జీలు మరింత భారం కానున్నాయి. ప్రస్తుత చార్జీలకు ఐదు శాతం అదనంగా పెరగనున్నాయి. ఇవి ఆదివారం అర్ధరాత్రి నుంచి అమలులోకి రానున్నాయి. టోల్‌గేట్‌ల ఫీజును వసూలు కాంట్రాక్టును దక్కించుకున్న వ్యక్తి/సంస్థ ఏటా టోల్‌గేట్ రేట్లను పెంచుకోవడానికి అనుమతిస్తారు. ఇందుకు సంబంధిత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తారు. ఇలా ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెంచిన టోల్ ఫీజును వసూలు చేయాల్సి ఉంది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ అన్ని దశలు ముగిసే వరకు పెంపు అమలును నిలిపి వేశారు. జూన్ ఒకటో తేదీతో తుది దశ పోలింగ్ పూర్తయింది. దీంతో ఆదివారం అర్ధరాత్రి (జూన్ 2వ తేదీ) నుంచి పెంచిన టోల్ ఫీజు చార్జీలను వసూలు చేయనున్నారు. ఇప్పటికే ఆయా టోల్ ప్లాజాల నిర్వాహకులకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. నిబంధనల ప్రకారం ప్రస్తుత చార్జీలపై ఐదు శాతం టోల్ ఫీజును పెంచారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అగనంపూడి, వేంపాడు టోల్ ప్లాజాలున్నాయి. వీటిలో అగనంపూడి టోల్ ప్లాజాలో మాత్రం కార్లు, జీపులు, వ్యాన్లకు టోల్ ఫీజులు పెరగలేదు. అక్కడ ఈ వాహనాలకు ఒక వైపు రూ.65, రానుపోను రూ.95 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇకపై కూడా వీటికి ఇవే చార్జీలు వసూలు చేయనున్నారు. ఇది ఈ టోల్ ప్లాజా మీదుగా రాకపోకలు సాగించే కార్లు, జీపులు, వ్యాన్లకు కాస్త ఊరటనివ్వనుంది. మిగిలిన వాహనాలకు కనీసం రూ.5 నుంచి రూ15 వరకు పెంచారు. అలాగే వేంపాడు టోల్ ప్లాజాలో కారు, జీపు, వ్యాను, లైట్ మోటారు వాహనాల (ఎల్ఎంవీ)కు ప్రస్తుతం ఒక వైపు రూ.135 వసూలు చేస్తుండగా ఇకపై రూ.140, రానుపోను రూ.200 నుంచి రూ.210కి పెంపుదల చేశారు. ఇంకా మిగిలిన వాహనాలపై రూ.10 నుంచి రూ.30 వరకు పెంచారు. పెరిగిన టోల్ ఫీజులను శనివారం నుంచే ఆయా ప్లాజాల్లో బోర్డుల్లో ప్రదర్శనకు ఉంచారు.

వేంపాడు టోల్ ప్లాజాలో ఇలా
(బ్రాకెట్లలో పాత ఛార్జీలు రూ.లలో)

వాహనం వివరం	సింగిల్	రానుపోను
కారు, జీపు, వ్యాను, లైట్ మోటార్ వెహికల్	రూ.140 (135)	రూ.210 (200)
లైట్ కమర్షియల్, లైట్ గూడ్స్ వెహికల్/మినీ బస్సు	రూ.225 (220)	రూ.335 (325)
బస్సు/ట్రక్కు	రూ.470 (455)	7రూ.00 (685)
త్రీ యాక్సిల్ వాణిజ్య వాహనం	రూ.510 (500)	రూ.765 (745)
భారీ వాహనం (7+ యాక్సిల్స్)	రూ.895 (870)	రూ.1340 (1310)
అగనంపూడి టోల్ ప్లాజాలో ఇలా..		
కారు, జీపు, వ్యాను, లైట్ మోటారు వెహికల్	రూ.65 (65)	రూ.95 (95)
లైట్ కమర్షియల్, లైట్ గూడ్స్ వెహికల్/మినీ బస్సు	రూ.105 (100)	రూ.155 (155)
బస్సు/ట్రక్కు	రూ.220 (215)	రూ.330 (320)
త్రీ యాక్సిల్ వాణిజ్య వాహనం	రూ.240 (235)	రూ.360 (350)
భారీ వాహనం (7+ యాక్సిల్)	రూ.420(410)	రూ.625 (610)

కంబాల కొండలో ఫిర్యాదుల పెట్టెలు

ఆరిలోవ (విశాఖ): ప్రముఖ పర్యాటక కేంద్రం కంబాల కొండ ఎకో టూరిజం పార్కులో అటవీ శాఖ అధికారులు ఫిర్యాదులు, సలహాలు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల ఇక్కడ టికెట్ కౌంటర్ వద్ద ఫిర్యాదులు స్వీకరించే పెట్టె, సూచనలు స్వీకరించే పెట్టె వేర్వేరుగా ఏర్పాటు చేశారు. కంబాల కొండకు వెళ్లే సందర్శకులకు ఎదురైన అసౌకర్యాలు, సమస్యలపై రాసిన చీటీ ఫిర్యాదు పెట్టెలో వేయాలి. లేదంటే ఆ పెట్టె కిందన అందుబాటులో రాసిన అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ ఫోన్ నంబర్ 9440810194కు ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు. దీంతో పాటు పార్కు అభివృద్ధి, కల్పించాల్సిన సౌకర్యాలు, సూచనలు, సలహాల గురించి రాసిన చీటీలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసిన సలహాల పెట్టెలో వేయాలని అధికారులు కోరుతున్నారు.

ఘనంగా తులసీదళార్చన

దాబాగార్డెన్స్ (విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ బేడా మండపంలో శనివారం ఉదయం 9.30గంటలకు స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను బేడామండపంలోని వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

3న విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా కొన్ని రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. మరికొన్ని రైళ్ల రీషెడ్యూల్ చేసినట్లు పేర్కొన్నారు.

రద్దు చేసిన రైళ్లు
ఆదివారం కొయంబత్తూర్-సిల్చార్(12515) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జూన్ 3న పలాస-విశాఖపట్నం-పలాస(07471/07470) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-గుణుపూర్-విశాఖపట్నం(08522/08521) పాసింజర్ స్పెషల్, విశాఖపట్నం-బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్, 4న బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

రీషెడ్యూల్ చేసిన రైళ్లు
పూరి-గుణుపూర్ (18417) గంట ఆలస్యంగా శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు, విశాఖపట్నం-కడప (17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 3.45గంటలకు, యశ్వంత్‌పూర్-పూరి (22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ 2.20 గంటలు ఆలస్యంగా మధ్య రాత్రి ఒంటి గంటకు, హౌరా-ఎర్నాకుళం (22877) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 2గంటలు ఆలస్యంగా సాయంత్రం 5గంటలకు, షాలిమర్ -చెన్నై సెంట్రల్ (12841) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా సాయంత్రం 4.25 గంటలకు బయలుదేరింది.

- జూన్ 2న రాత్రి 11.40 గంటలకు బయలుదేరాల్సిన సికింద్రాబాద్-సంత్రగచ్చి (07234) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా 3వ తేదీ తెల్లవారు 3.10 గంటలకు బయలుదేరుతుంది.
- జూన్ 3వ తేదీ తెల్లవారు 4.30 గంటలకు బయలుదేరాల్సిన సికింద్రాబాద్-షాలిమర్ (07225) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా తెల్లవారు 5.30 గంటలకు బయలుదేరుతుంది.

జైలుకు వైద్య సామగ్రి వితరణ

రూ.10.5 లక్షలతో అందించిన సింబయాసిస్, విజ్ఞాన్, జెన్ క్యూబ్ సంస్థలు



జైలు శాఖ ఐజీకి వైద్య సామగ్రిని అందజేస్తున్న దాతలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగానికి విశాఖకు చెందిన సింబయాసిస్, విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్‌కు చెందిన జెన్‌క్యూబ్ టెక్నాలజీ సంస్థలు వైద్య పరికరాలను అందజేశాయి. ఆ సంస్థల ప్రతినిధులు శనివారం కారాగారాన్ని సందర్శించారు. సీఎస్సార్‌లో భాగంగా రూ 10.50 లక్షల విలువైన వైద్య సామగ్రిని జైలు శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు, జైలు సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్‌కు అందజేశారు. ఈ పరికరాలను జైలు ఆస్పత్రిలో అమర్చనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఈ పరికరాల ద్వారా ఆధునిక పద్ధతిలో మూడు నిమిషాల్లో 73 వైద్య పరీక్షలు చేయవచ్చన్నారు. ఈ పరికరాలు అందుబాటులోకి వస్తే దేశంలోనే ఇలాంటి వైద్య పరీక్షలు అందించే మొదటి జైలుగా విశాఖ కేంద్ర కారాగారం నిలుస్తుందన్నారు. ఇది ఇక్కడ ఎనీ టైం క్లినిక్(ఏటీసీ) అని, అన్ని వేళల్లో అందుబాటులో ఉంటుందన్నారు.

రవాణా కార్యాలయంలోనే డీఎల్ పొందాలి

ఉపరవాణా కమిషనర్ రాజారత్నం

గోపాలపట్నం: రవాణా కార్యాలయంలోనే డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని.. డ్రైవింగ్ స్కూళ్లలో ఆ సదుపాయం లేదని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో జూన్ 1 నుంచి డ్రైవింగ్ స్కూళ్లలో డ్రైవింగ్ లైసెన్స్ పొందవచ్చని, రవాణా కార్యాలయాలకు వెళ్లే పనిలేదని వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టం చేశారు. లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లకు స్లాట్లు బుక్ చేసుకుని.. రవాణా శాఖ కార్యాలయాల్లో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. మోటార్ వాహన చట్టం సెక్షన్-12ను అనుసరించి డ్రైవింగ్ స్కూళ్లకు కూడా ప్రభుత్వ గుర్తింపు మంజూరు చేస్తామన్నారు. అక్రిడేటెడ్ డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ (ఏడీటీసీ) గుర్తింపు పొందడానికి కనీసం ఎకరా స్థలం(టూ వీలర్, త్రీ వీలర్, లైట్ మోటార్ వాహనాలు) ఉండాలని, మీడియం, భారీ వాహనాలకు కనీసం రెండు ఎకరాల స్థలం ఉంటేనే ఆయా సంస్థలకు గుర్తింపు మంజూరు చేస్తామన్నారు. వీటితో పాటు రెండు తరగతి గదులు, కంప్యూటర్లు, ప్రాజెక్ట్ సిస్టమ్, బ్రాడ్‌బ్యాండ్ సదుపాయం, డ్రైవింగ్ ట్రాక్‌లు, డ్యూయల్ కంట్రోల్‌తో ఓ వాహనం తదితర మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు. వర్క్‌షాప్‌లో వాహనం విడి భాగాలు ప్రదర్శించాలని సూచించారు. తర్ఫీదు పొందిన బోధకులు, తగిన స్టాఫ్, వాహనాలకు బీమా సౌకర్యం ఉండాలన్నారు. ఈ నిబంధనలు పాటించిన సంస్థలకు గుర్తింపునిస్తామని స్పష్టం చేశారు. 2021 జూలై ఒకటో తేదీన కేంద్రం ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఇంతర వరకు రాష్ట్రంలో ఒక్క దరఖాస్తు అందలేదని, సారథి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే అన్ని పరిశీలించి గుర్తింపు మంజూరుచేస్తామని వివరించారు.

8న మెగా జాబ్‌మేళా

సీతంపేట: అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్, విశాఖ ముస్లిమ్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా ఈ నెల 8వ తేదీన అక్కయ్యపాలెం అబిద్‌నగర్ హైవేరోడ్‌లో గల షాదీఖానా కల్యాణ మండపంలో మెగా జామ్‌మేళా నిర్వహిస్తున్నట్టు రహమతుల్లా బేగ్ తెలిపారు. ఆరోజు 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా కొనసాగుతుందన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హత కలిగి, 18 ఏళ్ల వయస్సు పైబడిన వారు జాబ్‌మేళాకు అర్హులని తెలిపారు. హాజరు కాదలచిన వారు 5 రెజ్యూమ్, 5 పాసుపోర్టు ఫొటోలు తీసుకురావాలన్నారు. www.tinyurl.com/ AMP jobDrive2024 వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 98481 95722 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్



కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న అధికారులు

మురళీనగర్: జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో శనివారం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. గైస్‌లో 75,001-83,500, పాలిటెక్నిక్‌లో 83,501-92,000, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 75,001-92,000 ర్యాంకుల విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. గైస్‌లో 174 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 206 మంది, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 72 మంది విద్యార్థులను సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఆదివారం గైస్‌లో 92,001-1,00,000, ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 1,00,001-1,08,000, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 92,001-1,08,000 ర్యాంకుల విద్యార్థులు హాజరు కావాల్సి ఉంటుంది. ఎస్టీ విద్యార్థులకు కంచరపాలెం పాలిటెక్నిక్‌లో కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

తెన్నేటి పార్కు వద్ద కారు పార్కింగ్ సౌకర్యం



కైలాసగిరి కొండ దిగువున ఏర్పాటు చేసిన కార్ పార్కింగ్

ఆరిలోవ: తెన్నేటి పార్కు ఎదురుగా కార్ పార్కింగ్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ కైలాసగిరి కొండ దిగువున విశాలమైన ఖాళీ స్థలం ఉంది. కొందరు వ్యక్తులు ఈ స్థలాన్ని అనుకుని ఉన్న కొండ భాగం కొంత తవ్వేసి అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేయించారు. వీఎంఆర్డీఏలో కొందరు అధికారులతో కలసి వాటిని వ్యాపారులకు అప్పగించి.. నెలనెలా డబ్బులు వసూలు చేసి జేబులు నింపుకునేవారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ మల్లికార్జునకు సందర్శకులు, స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో వీఎంఆర్డీఏ అధికారులు అనధికారికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని.. కార్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ పార్కింగ్ చేసిన కారుకు రూ.10 చొప్పున టికెట్ వసూలు చేస్తున్నారు. కాగా.. ఇంకా పార్కింగ్ సంబంధించిన పనులు జరుగుతున్నాయి. గతంలో ఈ పార్కుకు వచ్చే సందర్శకులు పార్కింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడేవారు. ఇప్పుడా సమస్య తీరిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.